కవర్ స్టోరీ

# హలో! ఫ్యామిలీ డాక్టర్



అది 1990. అప్పట్లో ఓ పల్లెటూరు. ఆ ఊళ్లో ఒక బడి, నాలుగు పచారీ కొట్లు, పంచాయతీ కార్యాలయంతో పాటుగా... ఆ పల్లె జీవితంలో భాగమయ్యేది ఓ చిన్న క్లినిక్. పిల్లలకి జ్వరం వచ్చినా, చెవిపోటు మెలిపెట్టినా, పెద్దోళ్ల మోకాళ్ల నొప్పులైనా, రక్తపోటు లాంటి జీవితకాలపు సమస్యలైనా... ఆ దవాఖానకే దారి. డాక్టరుగారు సౌమ్యంగా ఉన్నా చిర్రుబుర్రులాడినా జనం దృష్టిలో తను దేవుడే. తన హస్తవాసి అలాంటిది మరి. కిటకిటలాడే గదిలో ఒకరి తర్వాత ఒకరుగా రోగ లక్షణాలు చెబుతుంటే, వింటూనే ఠకఠకా మందులు రాసేస్తారు. ఆ లక్షణాలు తగ్గకపోయినా, పరిస్థితి విషమంగా తోచినా... వెంటనే పెద్దాసుపత్రికి సిఫార్సు చేసేస్తారు.

రోగిని ఇంతని ఫీజు అడగకపోవచ్చు. తర్వాత ఇస్తానన్నా పట్టించుకోకపోవచ్చు. జన్మనిచ్చిన తల్లిలాగే, పెద్దచేసే తండ్రిలాగే, చదువు చెప్పే గురువులాగే... ఆయన కూడా మనల్ని ఆరోగ్యంగా చూసుకునే బాధ్యతను తీసుకున్నారు మరి. అందుకే ఇప్పటికీ చాలామందిని వాళ్ల ఊరి జ్ఞాపకాలు గుర్తుచేస్తే అందులో ఆ ఫ్యామిలీ డాక్టర్ తప్పకుండా గుర్తుకొస్తాడు. వాళ్లలో చాలామంది ఆర్‌ఎంపీలు కావచ్చు. ఎంబీబీఎస్‌లూ ఉండవచ్చు. సర్జన్‌లూ కనిపించవచ్చు. కానీ ఫ్యామిలీ డాక్టర్‌గా ఇంటిల్లిపాదినీ కాచుకున్న చరిత్ర వాళ్లది.

కానీ ఇప్పుడు పిల్లలకి, మోకాళ్ల నొప్పులకీ, డయాబెటిస్‌కీ, కిడ్నీ రాళ్లకీ... అన్నిటికీ వేర్వేరు డాక్టర్లు. తప్పేం కాదు. కానీ ఈ హడావుడిలో మాయమైపోతున్న ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ, దానివల్ల కలుగుతున్న నష్టాలను మాత్రం ఓసారి తెలుచుకోవాల్సిందే!

... కె.సహస్ర